# స్నేహపతీయం

## శంకరమంచి పార్థసారధి

చలపతితో నా స్నేహం ఇప్పటిదికాదు. ఒకే స్కూలు, ఒకే సెక్షన్, రోజు కలిసి వెళ్ళడం, ఒకే కేరేజిలో తిని, ఒకే బెంచిపైన పడుకుని, ఇద్దర్లో ఎవరికి మెళుకువ వచ్చినా, రెండో వాళ్ళని లేపి, తిరిగి కల్సి రావటం. ఇలా సాగిపోయేది మా కార్యక్రమం.

అసలు మొదట్లో వాడు వేరే సెక్షన్. నాతో పరిచయం అయ్యాక, సరాసరి వచ్చేసి మా సెక్షన్లో నా బల్లపైన కూర్చోటం మొదలు పెట్టాడు. మా క్లాస్ టీచరు కొన్నాళ్ళు ఈ దృశ్యాన్నిచూసి, మిక్కిలి సంతసించినవాడై, వాడి పేరుని ఆ సెక్షన్లో కొట్టేసి, మా సెక్షన్లో వ్రాసేసాడు. అప్పట్లో ఎడ్యుకేషన్ చాలా లిబరల్గా వుండేది. ఇప్పట్లాగాకాదు.

ఆ రోజుల్లో ఈ చలపతిని మేమంతా 'పతి' అని పిలుస్తూ ఉండేవాళ్ళం. అసలీ పతి గాడితో నా తొలి పరిచయం ఎలా అయిందో గూడా క్లుప్తంగా చెబితేనేగాని, నా వుబలాటం, వుత్సాహం చల్లారవు.

ఆ రోజుల్లో నేను మా స్కూలు మొత్తానికి పెద్ద ఆటగాడ్ని. అన్ని ఆటల్లోను పాలు(పెరుగు) పంచుకుంటుండేవాణ్ణి. మా డ్రిల్లు మేష్టారు భీమారావుగారు ఏదో ఒక్క గేము అఫోరించవోయ్ అంటుండేవాడు. అన్ని గేములు అఫోరించడంచేత దేంట్లోనూ రాణించలేక పోవటమే కాకుండా, అసలు స్పోర్టివ్ నెస్ లేకుండా తుడిచిపెట్టుకు పోయింది. ఆ కాలంలో ఓ సాయంకాలం నేను మా స్కూలు ప్లేగ్రౌండ్లో ఫుట్ బాల్ ఎడాపెడా ఆడేస్తుంటే, ఈ పతిగాడొచ్చి తీర్థంలో తప్పిపోయిన పిల్లకాయలాగా వెర్రిచూపులు చూస్తూ గోలు గుంజకి ఆనుకుని నిల్చున్నాడు. అప్పుడు వాడిని మొదటిసారిగా చూసేను. అంత ఆట మధ్యలోవుండికూడా ఈ పతిగాడిని ఎందుకు పర్టిక్యులర్గా చూసానంటే— కారణం వుంది. అంతకు నాలుగు రోజుల క్రితం వాడు గోడమీంచి పడ్డాట్ట (తర్వాత చెప్పాడు). అందుచేత డాక్టరుగారు వాడి చేతికి బేండేజి చుట్టి, ఆ చేతిని వాడి మెడకే మూడుముళ్ళతో బిగించి, పదహేరు రోజుల పండక్కి రమ్మని వూరిమీదకు వదిలాట్ట. కట్టు కొత్తది కావటంతో సాయంకాలం నీరెండ బేండేజి గుడ్డపైనపడి వెండిచెయ్యిలాగా మెరిసి పోతుంటే నాలోవున్నకవి, ఆట ఆపి అటు చూడవోయ్ అనటంతో, అటు చూసేను. వాడూ చూసేడు. ఇద్దరి చూపులు కల్సుకున్నాయ్. సంభాషణ ఇలా జరిగినట్లు గుర్తు.

'ఏమైంది (చేతికి)?'

'గోడమీంచి పడ్డా'

'ఏగోడ, ఎవరిగోడ?'

'మా సాకిదొడ్డి గోడ'

'అరెరె-అయినా అదెందుకెక్కావ్?'

'జామకాయ కోద్దామని...'

'ఓహో-అంటే మీ ఇంట్లో (అదే దొడ్లో) జామచెట్టు వుందన్న మాట'

'నూను-మా పక్కింటి వాళ్ళ దొడ్లో వుంది. గోడ ఎక్కి కాయ అందుకునే వేళకి పక్కింటి పిన్నిగారు స్నానాలగదిలోంచి లేచి నిల్చుని గట్టిగా అరిచింది. అప్పటిదాకా నా దృష్టంతా పండుమీదనేగాని పిన్నిగారి మీద లేకపోవటంతో, ఆవిడ వొక్కసారిగా గాండ్రించేసరికి కళ్ళుబయిల్లుకమ్మి, కాల్జారి, మా సాకిదొడ్లోనే పడ్డా'

ఆ మాట వినగానే నాలో కవి 'సత్యా-చూసేవా? కాలుజారటం అనే కార్యక్రమం ఒక్క ఆడవాళ్ళకే పరిమితంకాదు. అసలు కాలు అనే అంగానికి జారుడనే బలహీనత అనాదిగా వస్తోంది. ఆడదానికి జారి అల్లరి పెడుతుంది. మగవాడికి జారి మెడకు చుట్టుకుంటుంది. జాగ్రత్తసుమా,' అనే వేదునిజాన్ని, కఠిన సత్యాన్ని, విప్పిచెప్పాడు.

అలా మొదటిసారిగా దర్శించిన పతిగాడి రూపం జిరాక్సు కాపీ గుద్దినట్టు గుర్తుండి పోయింది. ఇప్పటికీ వాడ్ని చూస్తుంటే చేతికి బాండేజి వున్నట్టు అనిపిస్తుంది. అదేం ఖర్మో, ఎవరి ఖర్మోగాని.

అలా మొదలైన మా పరిచయం, కాలక్రమేణా ఏపుగా పెరిగింది. ఒకే బల్లపైన కూర్చోటం, కల్సి ఇంటికెళ్ళటం, పరీక్షలొస్తున్నాయంటే వాళ్ళింటి నాసారాలో వాళ్ళ వాళ్ళంతా నిద్దరపోయేక జాయింటుగా కాపీలు వ్రాసుకోవటం, అత్తెసరు మార్కులతో బ్రతుకుజీవుడా అని స్కూల్లోంచి బయటపడటం, మళ్ళీ తలో కాలేజీలో చేరడం. మా స్నేహం కాలేజీకొచ్చేసరికి కాస్తపలచబడిందనే చెప్పాలి. వాడి ధోరణిలో చాలా మార్పు వచ్చింది. ధోరణిలోనే కాకుండా శారీరకంగాగూడా మారిపోయాడు. నాకన్నా పొడుగ్గాసాగి, మొహం ముదిరి, గడ్డం, మీసం


పుష్కలంగా, పూర్తిగా వచ్చేసాయి. కల్సినప్పుడల్లా శివ గురించి, కొత్త గడ్డాన్ని నిమురుకుంటూ గొప్పగా లెక్చర్లు దంచేవాడు. గడ్డం పూర్తిగా రావటం గొప్ప
విషయంట. సమాజాన్ని ప్రభావితం చెయ్యాలని, నడుంకట్టినవాళ్ళు, ప్రభావితం చేసినవాళ్ళు- అందరికీ ఏపుగా, గుబురుగా పెరిగిన
గడ్డాలున్నాయిట, కావాలంటే నేవెళ్ళి హిస్టరీబుక్కు చూడాలంట. నా కటివ్స్? అన్నాన్నేను. రాముడూ,
కృష్ణుడు, శివుడు, శ్రీమన్నారాయణుడు, కనీసం ఆంజనేయులవారు-వీళ్ళెవళ్ళకీ
గడ్డాలు లేవుగదా! అయితే గొప్పవాళ్ళు
కాలేదా అనేది నా పాయింట్. ఇలా
మాటామాటా పెరిగేది. పూర్తిగా
గడ్డం రాకపోవటం నా లోపంగా
చిత్రించి నన్నో నిమ్నజాతి
మనిషిలాగా చిన్నచూపు

మాసేవాడు. దాంతో కావాలనే కాస్త వాడికి దూరం అయ్యేను. డిగ్రీ కాగితం చేతికిరాగానె, పొట్టచేత్తో పట్టుకుని దేశం మీదపడ్డాం. ఆ తర్వాత, దాదాపు పదిపదిహేను సంవత్సరాలు వాడిగురించి నాకేంతెలీదు.


అలాంటిది...మొన్న ఓరోజు సాయంకాలం... ఆఫీసు అయ్యేక, కాఫీ సేవిద్దామని దగ్గర్లోవున్న హోటల్లోకి జొరపడ్డాను. సప్లయిరు కాఫీ ఇచ్చి, వెంటనే బిల్లుకూడా బల్లపైన అతికించి, నిష్క్రమించాడు. కాఫీ తాగిలేచేసరికి బిల్లు ముక్క ఫాన్‌గాలికి కాసేపు రెపరెపలాడి, ఆపైన టపీ మంటూ ఎగిరి పక్కా పోయింది. దాన్ని వెతికి పట్టుకుందామన్న ధృడ సంకల్పచిత్తుండనై, నేనేమో బల్ల కిందకి చొరబడి మాస్తుండగా కౌంటర్ దగ్గర ఏదో ఘర్షణ జరుగుతున్నట్టుగా గుర్తించి, పని కానిస్తూనే, అక్కడినుంచి ఆ వైపుగా మాసేను.

ఒక నడివయస్సు వ్యక్తి గట్టిగా, బలంగా కౌంటర్‌గుద్ది వాదిస్తున్నాడు. ప్లేటు ఇడ్లీ మేసి, ఓ కాఫీ భరిస్తే రెండు బిల్లులు కట్టాలంటున్నాడు. మొదటిసారి మీరిచ్చింది మీబిల్లు కాదంటాడు సప్లయిర్ కుర్రాడు. వాదికానప్పుడు నా బల్లపైన ఎందుకుంచేవంటూ లాజిక్కు లాగేడు ఆ ఆసామి. నాకేం తెలీదు మహాప్రభో అంటాడు వాడు. పైనించి వూడిపడిందా అంటాడు' వీడు.
జరిగిందేమిటో నాకర్థమై పోయింది.

నా బిల్లు కాగితం గాలికి ఎగిరెళ్ళి ప్రక్క బల్లపైన పడటమూ, దాన్ని తనదిగా భావించి, ఆ వ్యక్తి చెల్లించి వెళ్ళి పోతుండగా సప్లయిరు ఇంకో బిల్లు చేతికిచ్చేడు. అదీ గొడవ!
'అయితే ఇంతకీ ఆ మొదటి బిల్లు ఎవరిది?' అనడిగాడు క్యాష్‌లోవున్న అర్టిపండు రంగులోవున్న కుర్రాడు.

అంతా అర్థం చేసుకుని ఇంకా బల్లకిందే వుండిపోయిన నేను ఇహ వుపేక్షిం చటం సబబుకాదని, అక్కడ్నించే 'నాది' అంటూ అరిచినంత పనిచేద్దామనుకుని, నిజంగా అరిచేను. దాంతో అక్కడున్న వాళ్ళంతా ఒకేసారి నావంక వొంగివొంగి మాసేరు. సరిగ్గా అప్పుడు గుర్తించేను పతిగాడ్ని! నారే... పతి నువ్వురా' అనంటే, వాడు ఏమాటకామాట చెప్పకోవాలి, మూడంగల్లో వచ్చేసి, ఆప్యాయంగా నాదు బల్లకిందికి దాదాపు దూరిపోయి 'ఒరోరి... నువ్వురా... ఏమిటి వెదుక్కుంటు న్నావ్' వగైరా పరామర్శలతో పలకరించాడు. జరిగింది తెల్సుకుని ఇద్దరం నవ్వుకుని బయటి కొచ్చేం.

నేను సిగరెట్టు ముట్టించి కట్టపీకి ఆఫర్ చేసే, చుట్టతీసుకోమంటూ ఆర్డరేశాడు కర్కశంగా, గుంటూర్లో అర్నెల్లు పనిచేసాట్ట, వాడు అద్దెకున్న ఇంటి ఓనరు పొగాకు కంపెనీ తాలూకు వాడట, ప్రతిరోజా రాత్రిపూట బలవంతానా మొహమాటపెట్టి చుట్ట తాగించేవాడట. అలా మొదలయ్యి గుంటూరు వదలినా అలవాటు మాత్రం వొదలకుండా వుందిట. ఇదంతా నేను కిళ్ళీషాపులో చుట్ట





తీసుకుంటుండగా నా భుజంపైకి వొంగి చుట్టుపక్కల అందరికీ వినిపించేలాగా విన్నవించాడు. వాడు చుట్టవెలిగించేసరికి నా చేతిలో సిగరెట్టు, నా అగ్గిపెట్టెలో సగంపుల్లలు పూర్తయినాయి వాడు గుప్పగుప్పన గూడ్సుబండిలాగా పొగవదు లుతూ, మధ్యమధ్యలో కూతపెట్టినట్టుగా కాండ్రించి వుమ్మేస్తూ సంగతులన్నీ చెప్పకొచ్చాడు. వాడు 'ఈ వూరు బదిలీపైనవచ్చేట్ట, వచ్చికూడా ఏడాది కావ స్తోందిట. సనత్‌నగర్‌లో కాపరంట, అదెలా సాధ్యంఅంటే - చేతిలో చుట్టవంక ముసిముసి నవ్వులు మాస్తూ చెప్పాడు. పెళ్ళికి తాంబూలాలు పుచ్చుకోగానే, పీడివైపు పెద్దలెవరో హరీ మన్నారట. ఏడాదివరకు శుభకార్యం పనికిరాదంటే, పీడియో ఎజెండాలో కార్యక్రమాలు ముందువెనక చేసేసాట్ట, 'ఇంకా నయం నిజాయితీగా నిలబడ్డా'నని నే మెచ్చుకోపోగా, 'ఆ - చిన్నతనంకదా, తెలిసిచావక' అంటూ సవ్వరించేసి, 'అదిగో నా బస్సొచ్చేసింది, రెండ్రోజుల్లో మీ చెల్లెలిన ( అంటే వాడి వైఫ్‌నని వాడుద్దేశం) పిల్లల్ని తీసుకొస్తా ఇంట్లో తగలడ' మంటూ పెద్దగా అరుచుకుంటూ చుట్టతోసహా యామయ్యి బస్సెక్కేసాడు.


అలా వెళ్ళినవాడు చెప్పినట్లుగానే మూడోరోజుకల్లా భార్య, పిల్లలతో సహా దగడ్డాడు. పరిచయాలయ్యాక 'ఆడోళ్ళు కష్టం సుఖం మాట్లాడుకుంటుంటారు. మనం అలా వీధిలోకి వెళ్దొద్దామా?' అని వాడంటే, నేను బయలుదేరుతుండగా వాడి అర్ధాంగి 'అన్నయ్యగారూ ఆయనగారి చుట్ట తాగితే చెప్పండి, దిక్కుమాలిన చుట్టలూ ఈయనాన్ను' అంటూ పతిదేవుడ్ని, పొగాకు కాడని ఏకతిట్టుతో సొదువుగా తిట్టినా పతిగాడు పట్టించుకోనట్లు వెదర్ గురించి, వాటర్ ప్రాబ్లమ్స్ గురించి మాట్టాట్టం నాకాశ్చర్యం అనిపించింది.

ఇద్దరం వీధిలోకి వచ్చి నడుస్తుంటే, ఆమాటా ఈ మాటా చెప్పి, చివరికి నాకో సమస్య వచ్చిపడిందోయ్, నువ్వయితే ఏం చేస్తావో చెప్పు' అంటూ చెప్పకొచ్చేడు.

వాడి భార్యకి నాట్యం అంటే ఇష్టంట, కాదు ప్రాణంట, ఆవిడ చిన్నత నంలో నేర్చుకోవాలని వువ్విళ్ళూరిపోగా, ఆవిడ తండ్రి, ఆవిడ వుత్సాహంపైన బిందెదు నీళ్ళుదిమ్మరించి పెళ్ళిచేసేసాట్ట. కాబట్టే ఆ నాట్యాన్ని ఇప్పుడు తన కూతురికి నేర్పాలని పట్టుబట్టిందిట, కాని పీడికేమో నాట్యం అంటేనే ఎలర్జీట. పైగా క్లాస్టిఫైరటగూడాను. పిల్లనాకేమో డైవర్షన్ ఆఫ్ మైండుట. కూతుర్ని డాక్టర్ని చెయ్యాలని వీడి చిరకాల వాంఛట, డాక్టర్స్ డాన్స్ చేస్తే ఏంబావుటుం దని వీడి వాదం. ఇంట్లో రోజా గొడవట. ఇదీ విషయం'.

అంతా విని 'ఇదో పెద్ద సమస్యా, వడ్లగింజలో బియ్యపు గింజ' అంటూ సర్దిచెప్పబోతుండగా, వాడేమో కాస్త సీరియస్సుగా మొహంపెట్టి, 'వొడ్ల గింజలో బియ్యంగింజ కాక బాదంపప్పుంటుందా. అయినా నీకుచెప్పకోవటంఏమిటి నా తెలివితక్కువతనం కాకపోతే' వగైరా మాటలతో బాధపడిపోతుంటే, నేనే మళ్ళీ కలగచేసుకుని అదిగాదోయ్ పతీ .. నావుద్దేశం, విషయం స్వల్పమైనదేనని - కూతుర్ని డాక్టర్ చేయాలని నువ్వు, డాన్సర్ చేయాలని నీ భార్య దీన్ని గురించి ఇంట్లో రోజా రభస రాద్ధాంతము - అంతెగాక పైగా నీ భార్య పట్టుదలగల మనిషి






సాధించేవరకు నిద్రపోదని నువ్వేగా చెప్పావ్ మరలాంటప్పుడు, గొడవలూ రాద్ధాంతాలూ దేనికి, నీ భార్య ఇష్టప్రకారం కానిస్తే సరి' అంటూ గీతోప దేశం చేద్దామని చూస్తే వాడేమో గుర్రుగా చూస్తూ, 'నా పిల్లల ఫ్యూచర్ విషయంలో కాంప్రమైజేషన్ వస్తే కుదర్దు. కావాలంటే డైవర్స్ ఇచ్చిపారేస్తానంతే, ఏం పెళ్ళికాదని భయమా? అన్నాడుస ఎవరి పెళో, దాన్నిగురించి ఎవరికి భయమో నాకేం అర్థంకాక ఆలోచనల్లోనే ఇంటిదాకా వచ్చాక, నాతోపాటు ఇంట్లోకి రాకుండా, 'నువ్వెళ్ళి కాస్త నచ్చచెప్పు, ఈ కుప్పిగంతులు కూడూపెట్టవని మొహం వాచేటట్లు తిట్టిమరీ చెప్పు, ఏం భయంలేదు. పరాయివాళ్ళని పన్నెత్తుమాట అనదు. ఈలోపు నే వెళ్ళి ఓ చుట్టలాగించేస్తా'నంటూ వెనక్కి వెళ్ళిపోయాడు.

నే ఇంట్లోకి అడుగుపెట్టేసరికి నా ఇంటిదీపం, పతిగాడి ఇంటి దీపం చెరో కుర్చీలో ఫోకస్ దీపాల్లాగా బలంగా కూర్చునుండగా, పతిగాడి కూతురు (సుధారాణి కాబోలు పేరు) పరికిణీ కుచ్చిళ్ళు పైకిలాగి, గదికి ఆవైపు నుంచి ఈవైపుకు, ఈవైపు నించి ఆవైపుకి గెంతుతూ ఆయాస పడిపోతూ, నన్ను చూడంగానే వూపిరి పీల్చుకోవడానికన్నట్లు ఆగిపోగా, ఆ పిల్లతల్లి 'ఆపకమ్మా - అంకుల్ కూడా చూస్తారు' అనటంతో ప్రదర్శన కొనసాగింది. టీవీల్లో ప్రతిరోజూ వచ్చే ప్రోగ్రాంలు చూసే ఇదంతా నేర్చుకుందిట. చక్కగా మేష్టార్ని పెట్టి నేర్పిస్తే ఇంక ఎంతబాగా చేస్తుందోగదాని ఆవిడ ప్రత్యక్షంగా ఫీలయ్యి, 'ఏమోలెండి అన్నయ్యగారు, ఏంఅనుకుని ఏం లాభం? ఆయన కవన్నీ గిట్టవుగదా, ఆడపిల్లకి ఆటాపాటా నేర్పిస్తే నష్టం ఏవుంది, పైగా ఇంటికెంత కళ? ఇవన్నీ ఆయన కర్థంకావు. రోజూ రభస, రాద్ధాంతవూ.. ఎంతసేపూ, నా కళ్ళుగప్పి చుట్టతాగుదాం-' అంతవరకు వచ్చాకే పతిదేవుడు రాలేదన్న విషయాన్ని గుర్తించి- 'అవును ఆయనేరి? మళ్ళీ ఆ ముదనష్టపు చుట్ట ముట్టించారా?' అనడగటంతో, నాక్కాస్త కంగారనిపించి ఏం చెప్పాలో తెలీక, 'అబ్బే - వాళ్ళ కొలీగ్ కలిస్తే ఆఫీసు విషయాలు డిస్కస్ చేస్తానంటే-' అంటుండగానే ఆవిడ నే చెప్పేది నిజం కాదని అర్థమైపోయినట్లుగా, 'అలాగే - ఇప్పుడేవస్తా'నంటూ మూడంగల్లో వీధిలోకి వెళ్ళిపోయింది. ఎంచేతనో నా గుండెల్లో గుబులనిపించింది. సుధారాణి దీంతో సంబంధం లేనట్లు నాట్యం పేరున గంతులువేస్తూనే వుంది. నేను నా భార్యవంక అర్థవంతంగా చూడగా, దానికి నా వుద్దేశం అర్థంకావటంతో, ఆపిల్లతో ఇహ చాల్లేమ్మా, బాగా చేసేవ్, ఇలావచ్చి కూర్చో' అంటూ మెరిట్ సర్టిఫికేట్ ఇచ్చినా, ఆ పిల్ల ఆగకుండా 'ఆపితే మమ్మి కేకవేస్తుంది ఆంటీ' అంటూనే ఆయాసపడిపో సాగింది.

పదినిమిషాల తర్వాత పతిగాడు, వాడిపెళ్ళాం వచ్చారు. ఇద్దరూ గంభీరంగా వుండటం చూస్తే వీధిలో పెద్ద గొడవే అయ్యుంటుందని వూహించేను. నా వూహ నిజమని మర్నాడు వాడే సాక్షాత్తు ఫోన్‌చేసి చెప్పాడు.


నేను ఇంట్లోకి రాగానే, వీడు సరాసరి కిళ్ళీ షాపువద్దకెళ్ళి మాంచి పొడుగాటి లంక పొగాకు చుట్ట తీసుకుని వెలిగించి రిలాక్స్ అవటంకోసం అక్కడున్న చిన్నబల్లపైన ఓకాలుంచి బాలరాజు సినిమాలో హీరోలాగా ఆకాశంవంక చూస్తూ గుప్పుగుప్పున పొగని ఫ్యాక్టరీగొట్టంలా వదులుతూ, ఆనందం అనుభవిస్తుండగా వాడి భార్య (పేరు సీతామహాలక్ష్మి) బ్రేకులుచెడిన బండిలాగా స్పీడుగా రావటం కనిపించిందట.

వాడికి ఆక్షణంలో ఏం చేయాలో తెలీక, చేతిలో పదార్థాన్ని విసర్జించే వ్యవధిగూడా లేక, ప్రక్కనే కొవ్వొత్తులు కొనుక్కుంటున్న ఓ.

లుంగీవాలా చేతిరెండువేళ్ళ మధ్య ఈ చుట్టని ఇరికించి, అప్పటికే వచ్చేసిన ఇల్లాల్ని చూసి, ఏం సీతా, ఇలా వచ్చావ్... హి.హి.హి... ఫైన్ వెదర్ అంటూ ఇకిలిం చేసాట్ట. ఆవిడేమో అనుమానంగా అటు ఇటూ చూసి ఆధారం దొరక్క, అనుమానంగా 'మళ్ళీ చుట్టతాగేరుకదూ... నిజం చెప్పండి' అంటూ నిల దీస్తుంటే, వీడేమో చాలా తేలిగ్గా 'ఛ ఛ... షోడాతాగి, నీకోసం షోడా సోర్బిలు చేయమన్నా... అందుకని' అంటూ వచ్చేస్తుంటే, చుట్టని అందుకున్న లుంగీవాలా అప్పటికి తేరుకుని, కోపంగా 'వాటీజ్ దిస్' అంటూ అడిగేట్ట, చేతిలో చుట్టని చూపిస్తూ... పతిగాడు ఆ ప్రశ్నకి పరమ అమాయకంగా మొహంపెట్టి, చుట్టని పరీక్షగా చూస్తూ—'దీన్ని ఎక్కడో చూసినట్టుంది-సీత... దీన్ని తెలుగులో ఏనంటారు? ఆ... చుట్టగదూ' ఈ విధంగా తిప్పలు పడిపోతుంటే ఆ లుంగీవాలా కోపంగా దాన్ని నేలకేసికొట్టి, 'బీ కేర్‌ఫుల్, ఆవిడ మొహం చూసి వదిలేస్తున్నా... ఎంగిలి చుట్టలు చేతికిచ్చిన వాళ్ళ నెవర్ని నేనింతవరకు క్షమించలేదు' అంటూ కొవ్వొత్తులు తీసుకుని డబ్బు లివ్వకుండా వెళ్ళిపోయాడుట. షాపువాడు లబో దిబోట. ఇదంతా చెప్పి చివర్లో, మా సుధ నాట్యాన్ని మీరు ఎంతో మెచ్చు కున్నారటగా? దాంతో అది ప్రేటేగిపోయి దాన్ని డాన్స్‌స్కూల్లో చేరిపిస్తోంది' అంటూ చెప్పకుపోతుండగా, అసలు జరిగిందేమిటో చెప్పాలని ప్రయత్నిస్తుండగానే ఫోన్ కాస్తా పెట్టేసాడు.

ఆ తర్వాత సుమారుగా మూడు నాలుగు నెలలపాటు వాడిని కలవటం కుదిరింది కాదు. వాడూ ఫోన్ చెయ్యలేదు. నాపైన కోపంగాని వచ్చిందేమోనని సందేహిస్తుండగా, ఓరోజు సాయంత్రం వాడే ఫోన్ చేసాడు. ఫలానా ఆస్పత్రి నించి మాట్లాడుతున్నాను. వెంటనే రమ్మని , ఎంతో హడావుడిగా చెప్పాడు, అంతే తొందరగా రెండో మాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఫోన్‌కస్తాపెట్టేసాడు. నాకంతా అయోమయం అనిపించింది. వీడు ఆస్పత్రిలో ఎందుకున్నాడు? వీడికి ఏమైనా అయిందా? లేక ఇంట్లో వాళ్ళకిగాని... ఇదీకాక చుట్ట తీరుబడిగా తాగటానికి ఆస్పత్రిలో జాయిన్ అయ్యాడా? ఏమిటోచూద్దామని వాడు చెప్పిన అడ్రసు ప్రకారం వెతుక్కుంటూ వెళ్ళాను.

అది క్రొత్తగా ప్రారంభించిన ఓ నర్సింగ్‌హోం. ఇంకా డాక్టర్లు, నర్సులు కొత్త వుబలాటంలో వుండటంచేత హడావుడి ఎక్కువగా వుంది. పేషెంట్లని పది నిముషాలకోసారి పలుకరించి పరామర్శిస్తున్నారు. నే లోనికి వెళ్ళేసరికి ఓ గదిముందు దీనంగా దిగాలుగా పతిగాడు, ఇంకోపక్క పీక్కుపోయిన మొహంతో ఎర్రబడ్డ కళ్ళతోవాళ్ళావిడ నిలుచున్నారు. నన్ను చూడంగానే ఆవిడ ఘొల్లు



మంది, పతి మౌనంగా వచ్చి తలొంచుకుని నిల్చున్నాడు ఏదో తప్పుచేసిన వాడిలాగా. ఏం జరిగిందని అడిగిన మాదట వాడేం జవాబివ్వకుండా గదిలోనికి మాడమన్నట్టుగా చెయ్యిచూపించేడు. రెండడుగులు ముందుకేసి లోనికి తొంగిచూసేను. నాకళ్ళని నేను నమ్మలేక పోయాను.

కేవలం నాలుగయిదు నెలల క్రితం ముద్దుగా, బొద్దుగా, ఆరోగ్యంగా, ఆనందంగా నే చూసిన సుభారాణి ఇప్పుడు బల్లిలా మంచానికి అతుక్కుపోయి పడుకునున్నది. ఆమె కళ్ళల్లో మునుపటి వుత్సాహంలేదు. మొహం పీక్కుపోయి జుట్టు వెరిగిపోయి చేతులు పుడకల్లాగా సన్నగా, అసహ్యంగా వున్నాయ్. ఆమె చూపుల్లో ఏదో నిస్తేజం, నిండు జీవితాన్ని కడదాకా చూసి విసిగిపోయి, అలసి పోయిన ముసలివాగ్గులావుంది ఆమె వాలకం.

కొద్ది క్షణాలు అలాగే ఆమెని చూస్తూ నిల్చుండిపోయాను. కొద్ది నెలల కాలంలోనే మనిషిలో ఇంతటి మార్పు వస్తుందా అనిపించిందినాకు. అక్కడినుంచి కదిలి చలపతివద్ద కొచ్చి 'ఏమిటి కంప్లయింటు? ఎన్నాళ్ళయింది ఎడ్మిట్ చేసి? అయినా అంత వీక్‌గా వుంటే చూస్తూ ఎలా వూరుకున్నారు? అంటూ మొదలు పెట్టేసరికి వాడి భార్య కళ్ళుతుడుచుకుంటూ చెప్పకొచ్చింది. 'వుదయం మామూలుగా ట్యూషన్‌మంచివచ్చి ఆలస్యం అయిపోయిందని అన్నంతికుండానే స్కూలుకి వెళ్ళిపోయింది. దానికి అలవాటేగదాని నేమూ వూరుకున్నాము. కాని స్కూలుకి వెళ్ళగానే క్లాసురూంలో పడిపోయిందిట, స్కూలువాళ్ళు ఇక్కడ ఎడ్మిట్ చేసి మాకు కబురుపంపించారు.


'నిన్ననే చెప్పాను. ఓపికలేకపోతే రెండు రోజులు సాయంకాలం డాన్స్ క్లాసులు మానెయ్యమని, కాని అమ్మకేక వేస్తుంది నాన్న అంది' అంటూ పతి కళ్ళ నిండా నీళ్ళు తెచ్చుకున్నాడు. ఆ క్షణంలో వాడినిగాని, వాడి భార్యనుగాని చూస్తుంటే జాలి కలిగకపోగా చెప్పలేనంత కోపం వచ్చింది.

'అవున్రా ఎలా మానేస్తుందీ, అమ్మకోసం డాన్స్ క్లాసుకి, నాన్నకోసం ట్యూషన్‌కి వెళ్ళి తీరాలి. డాన్సరయి అమ్మని, డాక్టరయి నాన్నని వుద్ధరించాలి. వుదయం నుంచి రాత్రిదాకా విరామం లేకుండా చేసి, ఇప్పటి నించే యాంత్రికమైన జీవితాన్ని అలవాటు చేసిన గొప్పవాళ్ళు మీరు. పిల్లలంటే పువ్వుల వంటివాళ్ళు. హాయిగా, స్వేచ్ఛగా, సంతోషంగా, ఆడుతూ, పాడుతూ గడపాల్సిన వయసుని పూదరగొట్టి నిస్సారం చేసేశారు. ఎంతసేపు గొప్ప డాన్సర్ని చేయాలని ఆవిడ, డాక్టర్ని చేయ్యాలని నువ్వు పోటీలు పడివాదించుకుని వేధించేరేకాని ఏనాడన్నా ఆ పిల్ల ఇష్టం ఏమిటో అడిగేరా? తమ జీవితంలో ఏంకావాలని కలలు కంటుందో కనిపెట్టేరా? తెల్లకాగితంలాంటి ఆమె మనస్సుపైన మూర్ఖమైన మీ నిర్ణయాలన్నింటినిరుద్ది ఆమెలోని వుత్సాహాన్ని, వుద్రేకాన్ని చేతులారా చంపేశారు. అనారోగ్యంపాలు చేశారు. పిల్లలు తప్పదోవన పోతుంటే కల్పించుకుని దండించాలేగాని, వాళ్ళు ఏ బాటలో నడవాలో చెప్పాల్సింది మనం కాదు. ఈ జాడ్యం, దౌర్భాగ్యం మనలో పుష్కలంగావుంది కాబట్టే మన ఇళ్ళల్లో గుమాస్తాలు కోకొల్లలుగా కనిపిస్తారు.' డాక్టరు రావటంతో నా వుపన్యాసం ఆగిపోయింది. వాళ్ళిద్దరూ లోపలికి వెళ్ళగా చూసి, నేను ఇవతలకి వచ్చేసాను.

వారంరోజుల తర్వాత పతి దగ్గరనుంచి ఫోన్ వచ్చింది. నాల్రోజుల క్రితం పిల్లని డిస్‌చార్జి చేసారుట. కులాసాగా వుందిట. బలానికి టానిక్కులు, కాప్సిల్సు వాడుతున్నారుట. డాన్స్ ప్రాక్టీసు మాన్పించేసారుట. మెడిసిన్‌కూడా చదవను డిగ్రీచేసి బ్యాంకులో వుద్యోగం చేయాలని వుంది అన్నదిట. నీడేమో సరేనన్నాట్ట. అన్నీ చెప్పి ఆరోజు చెప్పకుండా వెళ్ళిపోయావేం అనడిగాడు. మీ అమ్మాయిని ఆ స్థితిలో చూడలేక వెళ్ళానని చెప్పి-సుభ మళ్ళీ పూలబంతిలా తయారయ్యాక చెప్ప అప్పటిదాకా రాను' అంటే వాడు పగలబడి నవ్వేడు—ఫోన్లోనే! ●


BRING HOME THE EXCITEMENT

VIDEOCON COLOUR TV RANGE




Authorised dealer

KAMISETTY ENTERPRISES

13-394, Y.V. Street, **Cuddapah** - 516 001. **Phones: 3537, 2658**